

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.149	216	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5 । కనిష్ఠం 25.2



నిప్పుల కొలిమి



- సెగలు కక్కుతున్న సూర్యుడు
- ఉమ్మడి జిల్లాలో 46.6 డిగ్రీలు నమోదు
- నల్లగొండ జిల్లాలో 22 మండలాల్లో రెడ్ అలర్ట్

నల్లగొండ, భువనగిరి అర్బన్, సూర్యాపేటటౌన్, మే 1: ఉమ్మడి నల్లగొండ జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ప్రజలే కాకుండా పశుపక్షాదులు కూడా నీటి కోసం తండ్లాడుతున్నాయి. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మునుగోడు మండలంలో 46.6 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 39.9 డిగ్రీలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 41.0 డిగ్రీలు నమోదైంది. అనంతగిరిలో 46.3, పాలకీడులో 46.3, సూర్యాపేటలో 46.2, పెన్‌పహాడ్‌లో 46.0, మోతెలో 45.9, మట్టంపల్లి, మేళ్లచెర్వులో 45.8, నూతనకల్‌లో 45.7, ఆత్మకూర్(ఎస్)లో 45.6, కోదాడలో 45.5, హుజూర్‌నగర్‌లో 45.5, గరిడేపల్లి, చివ్వెంలలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో 44డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో అత్యధికంగా 45.6 డిగ్రీలు, తుర్కపల్లిలో అత్యల్పంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే నల్లగొండ జిల్లాలో 22 మండలాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదు కావడంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడ గాడ్పులు.. నిప్పుల కొలిమిలో వెళ్లేందుకు వాహనదారులు భయపడుతున్నారు. భానుడి ప్రతాపానికి వడదెబ్బతో వృద్ధులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండలు ముదరడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి వ్యాపారాలు కూడా డీలా పడుతుండగా రైతులు, కూలీలు, కార్మికులు ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం పని నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఎండ దెబ్బకు నిమ్మసోడ, చెరుకు రసం, పండ్ల రసాలు తాగి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

గత ఏడాది, ఈ ఏడాది ఏప్రిల్‌లో

ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఇలా..

	2023 ఏప్రిల్‌లో		ఈ ఏడాది ఏప్రిల్‌లో	
తేదీ	గరిష్ఠం	కనిష్ఠం	గరిష్ఠం	కనిష్ఠం
20న	41.0	24.0	40.0	24.8
21న	40.0	24.4	41.0	25.2
22న	38.0	21.4	41.5	24.4
23న	37.5	21.0	42.0	24.0
24న	37.0	22.0	41.5	24.4
25న	39.0	22.4	42.5	24.8
26న	38.5	20.0	43.0	24.6
27న	37.0	21.0	41.5	24.8
28న	38.0	22.0	45.5	25.0
29న	35.0	23.0	42.0	25.2
30న	35.5	22.4	43.0	25.4

ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి



డీహైడ్రేషన్‌కు గురైన వ్యక్తికి ప్రభుత్వం ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తుంది. ఓఆర్ఎస్ (ఓరల్ డీహైడ్రేషన్ సొల్యూషన్)లో సోడియం క్లోరైడ్ 2.6గ్రాములు, పొటాషియం క్లోరైడ్ 1.5గ్రాములు, సోడియం సిట్రేట్ 2.9గ్రాములు, చక్కెర 13.5 గ్రాములు ఉంటుంది. ఇవన్నీ కలిసిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకుంటే డీహైడ్రేషన్ నుంచి బయటపడవచ్చు. ద్రావణాన్ని కలిపే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి. ఒక లీటర్ నీటిలో మొత్తం ప్యాకెట్‌ను కలపాలి. కలిపిన ఓఆర్ఎస్‌ను 24 గంటల లోపు వినియోగించాలి. నీళ్ల విరేచనం అయిన ప్రతీ సారి ఈ ద్రావణాన్ని ఇవ్వాలి. రెండేళ్ల లోపు పిల్లలకు పావు గ్లాస్, 2-10 ఏళ్ల లోపు పిల్లలకు అర గ్లాస్, 10 ఏళ్లు దాటిన వారికి ఎంత తాగితే అంత ఇవ్వాలి. డీహైడ్రేషన్‌కు గురికాకుండాఉండేందుకు, వేసవి తపాన్ని తట్టుకునేందుకు శరీరంలో నీటి శాతాన్ని ఎప్పటికప్పటికీ పెంచుకుంటే మంచిది. ఎక్కువగా ద్రవ పదార్థాలు, నీరు అధికంగా ఉండే పండ్లు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవడం ఉత్తమం.

– జగన్నాథచార్యులు, వైద్యుడు



వడదెబ్బతో ప్రాణానికి ముప్పు

వేసవిలో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



కోదాడ, మే 1: రోజురోజుకూ పెరుగుతున్న భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. వడదెబ్బతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ వేడిమికి శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం అధికం. వడదెబ్బతో నీళ్ల, రక్త విరేచనాలు, వాంతులు ఎక్కువైనప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. పెద్దలతో పోలిస్తే చిన్న పిల్లలు అధికంగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు, మూత్రం తరుచుగా రావడం, అసలు రాకుంటే జాగ్రత్తగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

డీహైడ్రేషన్ లక్షణాలు

- మూత్రం ముదురు పసుపు పచ్చ రంగులో వస్తుంది.
- అకస్మాత్తుగా బరువు తగ్గుతారు. శరీరం పొడిబారుతుంది.
- లోతుకుపోయిన చమ్మలేని కళ్లు ఉంటాయి.
- చంటి పిల్లల మాడు లోపలికి పోతుంది.
- శరీరం సాగే శక్తిని కోల్పోతుంది.
- చర్మాన్ని రెండు వేళ్లతో (బొటన, చూపుడు) పైకి లాగినప్పుడు ముడత యథాస్థానానికి వెంటనే వెళ్లక నెమ్మదిగా వెళ్తే డీహైడ్రేషన్‌గా గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- డీహైడ్రేషన్‌కు గురైన వ్యక్తి నీరు, మజ్జిగ, తదితర పానీయాలు అధికంగా తీసుకోవాలి.
- విరేచనాలు అవుతున్న వ్యక్తికి వాంతులు అవుతున్నా, కాకపోయినా ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి.
- డీహైడ్రేషన్ అయిన వ్యక్తికి పగలు, రాత్రి తేడా లేకుండా ప్రతీ 5నిమిషాలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందిస్తూ ఉండాలి. ▸ పెద్దవారికి 3లీటర్లు, చిన్నవారికి లీటరు ద్రావణాన్ని ఇవ్వాలి.
- లీటర్ మరగకాచి చల్లార్చిన నీటిలో రెండు పెద్ద స్పూన్ల పంచదార లేదా తేనె, పావు స్పూన్ ఉప్పు, పావు స్పూన్ వంట సోడా లేదా, అర స్పూన్ ఉప్పు కలిపిన నీటిని తాగించాలి. వీలైతే అరకప్పు నారింజ రసం, నిమ్మ రసం ఈ నీటిలో కలిపి ప్రతీ 5నిమిషాలకు ఒకసారి ఇస్తూ ఉండాలి.
- చిన్న పిల్లలు దాహం అని చెప్పరు కనుక తల్లిదండ్రులే మాటి మాటికి నీటిని తాగించాలి.
- డీహైడ్రేషన్‌కు గురైనవారికి వాంతులు అవుతున్నా సరే ద్రావణం ఇవ్వడం నిలపొద్దు. వాంతులు అయితే కొద్ది కొద్దిగా ద్రావణాన్ని తాగించాలి.



సామాజికాన్ని పట్టేందుకు

- ఓటు బ్యాంకు కలిగిన వర్గాలకు దగ్గరయ్యే వ్యూహాలు
- పట్టణాల్లో ఉద్యోగ, నిరుద్యోగ, ప్రొఫెషనల్స్, వృత్తిదారులపై దృష్టి
- ఆయా వర్గాలకు గాలం వేస్తున్న ప్రధాన పార్టీలు
- ప్రత్యేకంగా సమ్మేళనాలతో ఆకట్టుకునే యత్నాలు

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ సమరం వేడెక్కుతున్న కొద్దీ అభ్యర్థులు, పార్టీల నాయకులు సామాజిక సమీకరణాలపై దృష్టి సారించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో ఎక్కడ ఏ వర్గం ఏ రకమైన ప్రభావాన్ని చూపగలుగుతుందనే అంచనాల్లో ఆయా పార్టీల నేతలు, వ్యూహకర్తలు మునిగితేలుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజికవర్గాల మద్దతుకు ప్రయత్నిస్తున్న పార్టీలు, పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి కార్మిక, ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థి వర్గాలతో పాటు, ప్రొఫెషనల్స్, ఉపాధ్యాయుల మద్దతు కోరుతున్నారు. ఓ వైపు ర్యాలీలు, రోడ్‌షోలతో ప్రచారం సాగిస్తూనే, మరోవైపు ఆయా వర్గాల సమ్మేళనాలు, గెట్ టుగెదర్‌లకు హాజరవుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

ఓటు బ్యాంకు ఉన్న సామాజికవర్గాలపై కన్ను

ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో వేర్వేరు సమీకరణాలు తెరమీదకు వచ్చాయి. నల్లగొండ లోక్‌సభ స్థానంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో పాటు అత్యధిక ఓటర్లు కలిగిన లంబాడ (ఎస్టీ), యాదవ్ (బీసీ) సామాజికవర్గాలతో పాటు దళిత సామాజికవర్గ ఓట్లపై ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు దృష్టి సారించారు. ఈ రెండు వర్గాల్లో అత్యధిక ఓటుని సాధిస్తే గెలుపునకు దగ్గరిదారి ఏర్పడుతుందనే అంచనాతో నేతలు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బరిలో ఉన్న ప్రధానపార్టీల అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఎక్కువ ఓట్లున్న సామాజికవర్గాలపై దృష్టి సారించారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) ఓసీ, డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామమల్లేశ్ (బీఆర్ఎస్) బీసీ, ఎండీ.జహంగీర్ (సీపీఎం) మైనార్టీ వర్గానికి చెందిన వారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ ఉన్న గౌడలతోపాటు, గొల్ల, కురుమ, పద్మశాలి, ముదిరాజ్ తదితర బీసీ సామాజికవర్గాలు, దళిత సామాజికవర్గం ఓట్లపై మూడు పార్టీలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ వర్గాల నుంచి అత్యధిక ఓట్లు తెచ్చుకోవడం ద్వారా గెలుపును అందుకోవాలనే ప్రయత్నాలను ఆ పార్టీలు ముమ్మరం చేశాయి. ఈ వర్గాల ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అసెంబ్లీ నియోజకవర్గస్థాయిల్లో ముఖ్యులతో సమావేశాలు, సమ్మేళనాలు నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ వర్గాలతో పాటు తక్కువ ఓటు బ్యాంకున్నప్పటికీ ఐక్యంగా ఓటింగ్‌కి అవకాశమున్న మరికొన్ని బీసీ వర్గాలు, మైనార్టీ ఓటర్లపై కూడా దృష్టిసారించారు. పార్టీలు, అభ్యర్థుల తరఫున ఈ వర్గాలకు చెందిన కీలకనేతలు, జిల్లా, రాష్ట్రస్థాయి బాధ్యతల్లో ఉన్న నేతలు ఓటర్లను సమీకరించే పనిలో పడ్డారు.



పట్టణ ప్రాంత ఓటర్లకు గాలం

గ్రామీణ ప్రాంతాల్లో సామాజికవర్గాల వారీగా ఓటర్లను ప్రసన్నంచేసుకునే కార్యాచరణ అమలు చేస్తున్న పార్టీలు పట్టణ ప్రాంతాల్లో అందుకు భిన్నమైన రీతిలో ఓటర్లను సమీకరించే పనిలో పడ్డాయి. ప్రధానంగా పట్టణాల్లో నివసించే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, వృత్తిపనివాళ్లను తమవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయా పార్టీల ఎజెండాలతో పాటు వ్యక్తిగతం తమకు మద్దతు ఇస్తే అన్ని విధాలా అండగా ఉంటామనే హామీతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌లో ఎక్కువగా పాల్గొనే ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా ఓట్లను పెంచుకోవచ్చని ఆయా పార్టీలు భావిస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయాల ప్రభావం సైతం ఈ వర్గాలపై ఉంటుండడంతో మద్దతు సంపాదిస్తే విజయానికి దగ్గరిదారి ఉంటుందని ఆయా పార్టీలు వ్యూహాలను అమలుచేస్తున్నాయి.



మేడే సందర్భంగా మేళ్లచెర్వులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అమరులను స్మరిస్తూ.. మే డే వేడుకలు

- వాడవాడలా ఎగిరిన కార్మిక జెండాలు
- వేడుకలు నిర్వహించిన అన్నిపార్టీల కార్మిక సంఘాలు
- పలుచోట్ల ర్యాలీలు, సమావేశాలు, సదస్సులు

వివరాలు 8లో

కార్మిక, కర్షక లోక పర్వదినం మేడేను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కార్మిక హక్కుల సాధనలో అమరులైన చికాగో అమరుల త్యాగాలకు గుర్తుగా చేసుకున్నారు. పార్టీల దిమ్మెలపై కార్మిక శాఖ జెండాలను ఎగురవేశారు. పలుచోట్ల కార్మిక సంఘాలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాయి. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు.



జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి కుమార్తె పదో తరగతి పరీక్ష రాసే సమయంలో కార్పొరేట్ విద్యా సంస్థలు అతడి కుమార్తె అడ్మిషన్ కోసం వెంటబడటం మొదలుపెట్టాయి. ముందస్తుగా చేరితో రాయితీ ఇస్తామని, అదేవిధంగా ఫీజులో కొంత చెల్లిస్తే మరికొంత రాయితీ ఉంటుందని ఆశ చూపించి కళాశాలలో చేరేలా చేశారు. ప్రస్తుతం కళాశాలకు అలవాటుపడాలని చెప్పి ఆన్‌లైన్‌లో పది రోజుల కిందటే తరగతులను ప్రారంభించారు.

– సూర్యాపేట అర్బన్

ఇంటర్ అడ్మిషన్ల కోసం మాయాజాలం

- కార్పొరేట్ కళాశాల మాయమాటలు
- ముందస్తు అడ్మిషన్ ఫీజులు
- ముందు చేరినవారికి ఫీజులో రాయితీ
- ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం

కార్పొరేట్ విద్యాసంస్థలు అప్పుడే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. పదో తరగతి పరీక్షల సమయంలోనే విద్యార్థుల వివరాలను సేకరించిన కార్పొరేట్ కళాశాలల యజమాన్యాలు పది ఫలితాలు రావడంతో ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులను ఏజెంట్లుగా నియమించుకున్నారు. వారి ద్వారా విద్యార్థుల వివరాలను సేకరించి అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల వెంటపడుతున్నారు. విద్యార్థుల చిరునామాలను తెలుసుకొని వారి ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. ఫలానా కళాశాల్లో చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెబుతున్నారు. ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, జే ఈఈ ఫలితాలను వస్తాయని ప్రచారం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన ఉండడంలేదని, జాతీయ విద్యాసంస్థల్లో సీట్లు, ఎంసెట్‌లో ర్యాంకులు సాధించాలంటే కార్పొరేట్ కళాశాలలకే సాధ్యమని ఏజెంట్లు నమ్మబలుకుతున్నారు. కళాశాల్లో చదివే మొత్తం విద్యార్థుల విషయాలకు బదులుగా ర్యాంకుల సాధించిన వారి వివ రాలు మాత్రమే వివరిస్తున్నారు. ఏజెంట్ల మాయాజాలానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బలవుతున్నారు. ప్రతీ ఏటా కార్పొరేట్ల మాయాజాలానికి జిల్లాలోని 50శాతానికి పైగా విద్యార్థులు హైదరాబాద్, విజయవాడల్లోని పలు ఆయా కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేట్ల ప్రచార సరళికి ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ఉత్తమ ఫలితాలు కనిపించకుండా పోతున్నాయి.

ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులే ఏజెంట్లు

హైదరాబాద్, విజయవాడ నగరాల్లోని పలు కార్పొరేట్ జూనియర్ కళాశాలల యజమాన్యాలు కొంతమందిని ఏజెంట్లను నియమించుకున్నారు. ఇందులో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. ఒక్కో విద్యార్థిని కళాశాలల్లో చేర్పించినందుకు కొంతమొత్తంలో వారికి డబ్బులు ముట్టజెప్పుతున్నారు. వీరి ప్రయత్నాలతో జిల్లాలో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో 50 శాతానికి పైగా విద్యార్థులు హైదరాబాద్, విజయవాడ నగరాల్లోని కళాశాలల్లో ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు. కొంత మంది విద్యార్థులు మాత్రమే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్నారు.

ముందస్తు అడ్మిషన్ ఫీజులు

కార్పొరేట్ జూనియర్ కళాశాలల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముందస్తు అడ్మిషన్ ఫీజును వసూలుచేస్తున్నారు. ఇవి ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. ఏసీ, నాన్‌ఏసీ క్యాంపస్‌ల పేరుతో ఫీజులను వసూలు చేస్తున్నారు. అంతేకాక పదో తరగతిలో మెరుగైన గ్రేడ్ సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీఇస్తున్నారు. అదేవిధంగా అడ్మిషన్లకు ముందస్తు చెల్లించిన వారికి కూడా ఫీజులో రాయితీ ఇస్తుండటంతో కొంతమంది తల్లిదండ్రులు డబ్బులు చెల్లించి అడ్మిషన్ పొందుతున్నారు.

నెల రోజులు పోలీస్ యాక్టు అమలు



విద్యార్థికి స్కాలర్‌షిప్ చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, మే 1: జిల్లాలో శాంతిభద్రతలు దృష్టిలో పెట్టుకుని ఈ నెల 30వ తేదీ వరకు 30, 30(ఏ) పోలీస్‌యాక్టు- 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం తెలిపారు. పోలీస్‌అధికారుల ముందస్తు అనుమతి లేనిది ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్‌మీటింగ్‌లు, సభలు సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టవద్దన్నారు.

విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

జిల్లా హోంగార్డు శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయచారి కుమారుడు నితిన్‌సాయి పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఎస్పీ రాహుల్‌హెగ్డే పోలీస్‌శాఖ మెరిట్‌స్కాలర్‌షిప్ చెక్కును అందజేశారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐ నర్సింహ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల నడవడికలో తల్లిదండ్రులే కీలకం



న్యాయ విజ్ఞానసదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, మే 1 : పిల్లల నడవడికలో తల్లిదండ్రులదే ప్రధాన భూమిక అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పీ శ్రీవాణి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో మేడే సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడారు. పిల్లలను సన్మార్గంలో పెంచాల్సిన ప్రధాన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. స్కూల్‌లో ఉపాధ్యాయులు కూడా పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తు విద్యార్థుల దృష్టి ఇతర విషయాలపైకి మళ్లకుండా చదువుపైనే కొనసాగించేలా చూడాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల బారిన పడకుండా పెంచినప్పుడే రేపటి సమాజంలో పిల్లలు వెలుగులు నింపుతారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డప్పు మల్లయ్య, వసంత సత్యనారాయణపిళ్లే, పట్టణ సీఐ జీ రాజశేఖర్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన మొదటి జిల్లా అదనపు జడ్జి

రాష్ట్ర హైకోర్టు సాధారణ పరిపాలన బదిలీలో భాగంగా మొదటి జిల్లా అదనపు న్యాయమూర్తిగా డాక్టర్. ఎం.శ్యాంశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసే జిల్లా అదనపు జడ్జిగా పనిచేస్తున్న అమరావతి బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో కొత్తగూడెం జిల్లాలో మొదటి జిల్లా అదనపు జడ్జిగా పనిచేస్తున్న శ్యాంశ్రీ బదిలీపై వచ్చారు.

హోం ఓటింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ వెంకటావు

సూర్యాపేట(కలెక్టరేట్), మే 1 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ హోంఓటింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో హోంఓటింగ్ నిర్వహణ బృందాలకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. 85 ఏళ్ల పైబడిన వారికి హోంఓటింగ్ అకవాశం కల్పిస్తున్నామని, ఈ ఓటింగ్‌కు జిల్లాలో 692 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు 25 మార్గాల్లో 29 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో హోం ఓటింగ్ పూర్తిచేస్తామన్నారు. వివిధ కారణాలతో హోం ఓటింగ్‌లో పాల్గొనకపోతే 2వసారీ ఈ నెల 8వతేదీ చేపడతామన్నారు. సెక్టోరియల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. సజావుగా ఎన్నికలు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఎఫ్‌డీవో రూపేందర్‌సింగ్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, రమేష్, వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు జాగ్రత్తలు తీసుకోవాలి

రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు తెలిపారు. ప్రజలు బయటుకు వెళ్లేటప్పుడు టోపీ, రుమాల్ ధరించాలని సూచించారు. నిమ్మరసం, కొబ్బరి నీరు, మజ్జిగ, గ్లూకోజ్ నీరు, ఉప్పు, చక్కెర గ్లాస్ నీటిలో కలుపుకొని తాగాలన్నారు. వడ దెబ్బ తగిన వారు చల్లని ప్రదేశంలో గాని, నీడలో ఉంచి తడివస్త్రంతో తుడవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు ప్రాథమిక స్థితికి రాకపోతే దగ్గరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వడదెబ్బకు గురైన వారికి అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉంటాయని, నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలి: డీపీవో



చౌటపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

మఠంపల్లి, మే 1 : పోలింగ్ సమయానికి ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. మండలవ్యాప్తంగా ఉన్న 25 ప్రాంతాల్లో 45 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందుకు నలుగురు సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. ప్రతీ సెక్టోరియల్ అధికారి ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు, మార్గదర్శకాలను తప్పనిసరిగా చదవాలన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగు నీరు, విద్యుత్, మరుగుదొడ్లతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మామిడి జానకిరాములు, ఎంపీవో ఆంజనేయులు, ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

రూ. 4.97 కోట్ల ఇంటిపన్ను వసూల్

సూర్యాపేట టౌన్, మే 1 : మునిసిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటి పన్ను రూ.4.97 కోట్లు వసూల్ అయినట్లు మునిసిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 8,079 గృహాలకు ఐదు శాతం రాయితీ ఇవ్వడంతో పన్ను వసూల్ గతేడాది కన్నా అధికంగా రూ.55లక్షలు వచ్చిందన్నారు. గృహయజమానులు ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, మే 1: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.32,27,683 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

యాదగిరిగుట్ట స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని నేవీ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెండర్కర్, రేర్ అడ్మిరల్ రవ్‌నీష్ సేత్ అన్నారు. యాదగిరి క్షేత్రాన్ని బుధవారం నేవీ అధికారులు దర్శించుకున్న తర్వాత వేదపండితులు వారికి మండపంలో వేద ఆశీర్వచనం అందజేయగా ఈవో ఏ.భాస్కర్‌రావు స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు. యాదగిరిగుట్ట ఎంతో మహిమాన్వితమైన క్షేత్రమని కొనియాడారు. ఆలయ విశిష్టతను, పునర్నిర్మాణ విశేషాలను వారికి ఈవో వివరించారు.

యువజన కాంగ్రెస్ పనితీరుపై సమీక్ష

హైదరాబాద్, మే1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో లోకసభకు పోటీచేస్తున్న పార్టీ అభ్యర్థులకు విజయం చేకూర్చడంతో పాటు ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని రాష్ట్రయువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి యువజన కాంగ్రెస్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యువజన కాంగ్రెస్ పని తీరును సమీక్షించారు. ప్రతినిధులకు ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పరిచయం చేశారు. ఉమ్మడి నలగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన యూత్ కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

హుజూర్‌నగర్, మే 1: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శివాలయం బజారుకు చెందిన తోట యేసుదయ(26) బుధవారం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని తోట పద్మకు ఇద్దరు కుమార్తెలు. కాగా ఏసుదయ చిన్నకుమార్తె. ఆమెకు వివాహం కాలేదు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. బుధవారం ఉదయం తోట పద్మ పెద్దకుమార్తెతో కలిసి పోస్టాఫీస్ వద్దకు వెళ్లి పింఛన్ తీసుకుని రాగా చిన్నకుమార్తె ఏసుదయ ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఏసుదయ అక్క వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

త్రిపురారం, మే1: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక ఇంట్లో అప్పాల సుదర్శన్, ఈట నాగరాజు, ఉప్పు రాజేష్, భైరం దశరథ, వల్లూరి సుబ్బారావు, పేకాట ఆడుతున్న సమయంలో హెడ్ కానిస్టేబుల్ పాపులు తన సిబ్బందితో కలిసి వెళ్లగా వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.7610 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో మిర్చిపంట దగ్ధం



దగ్ధమైన మిర్చిపంట, పైపులు

గుర్రంపోడు, మే 1: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని జూనూతుల గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు మిర్చిపంట దగ్ధమైంది. కుంభం మోహన్ అనే రైతుకు చెందిన మిర్చి పంట 7-బీ డిస్ట్రిబ్యూటరీ కాల్వలో ఉన్న జమ్మికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని వ్యాపించడంతో పక్కనే ఉన్న మిర్చి పంటతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు కాల్వలో నిప్పు వేసి ఉంటారని భావిస్తున్నారు. కరెంటు మోటారుతో పాటు డ్రిప్ పైపులు దగ్ధం కావడంతో సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

బాలికపై లైంగికదాడి.. కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్, మే 1: బాలికపై లైంగికదాడి చేసిన యువకుడిపై కేసు నమోదైంది. సీఐ రమేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బాలికను యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన ఎస్‌కె. మసూద్ ఈ నెల 29న పాతగుట్ట గ్రామానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లి యువకుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువకుడిపై లైంగికదాడి నేరం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ, మే, 1: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని ముదిగొండ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. ముదిగొండ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా ఇరుగుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మారపాకల గిరి, మారపాకల నగేష్‌లపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

లారీలు రావు.. బస్తాలు ఎత్తరు

- బస్తాకు రూ.3 ఇస్తేనే లారీలు పంపుతామంటున్న డ్రైవర్లు
- ఐదారు రోజులుగా ఎగుమతి కాని ధాన్యం బస్తాలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అరిగోస
- లారీలు రాక తూకం తగ్గడంతో కోతపెడుతున్న మిల్లర్లు



మోత్కూరు మార్కెట్లో లారీలు రాక, మిల్లుకు ఎగుమతి కాక నిలిచిపోయిన తూకం వేసిన ధాన్యం బస్తాలు

మోత్కూరు, మే 1: 'ధాన్యం పండించడం కంటే విక్రయించడానికే కష్టపడాల్సి వస్తోంది.' ఇదీ రైతులు ఆవేదన. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు అవుతున్నా తూకాలు కావడం లేదు. తూకాలు వేసిన బస్తాలు రైస్ మిల్లులకు ఎగుమతి కావడం లేదు. రైతులను ఇరకాటంలో పెట్టి లారీల యజమానులు(డ్రైవర్లు), మిల్లర్లు అందినకాడికి దండుకుం టున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తూకం వేసిన బస్తాలు మిల్లులకు ఎగుమతి చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకుని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌ను నియమించింది. కాంట్రాక్టర్ సకాలంలో లారీ పంపడం లేదని పలువురు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు చార్జీ చెల్లిస్తుండగా లారీల డ్రైవర్లు బస్తాకు రూ.3 చొప్పున అదనంగా రైతుల నుంచి వసూలు చేస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బు లు ఇస్తేనే బస్తాలు తీసుకెళ్లడానికి లారీలు పంపుతున్నారని, లేకుంటే పంపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు పంపక తూకం వేసిన బస్తా లు ఐదారు రోజులు ఎండలో ఉండే సరికి ధాన్యం తూకం తగ్గుతోంది. మిల్లుకు పంపగానే రైస్ మిల్లరు తూకం తక్కువ వచ్చిందని కోత పెడుతున్నారు. ఈ సంకట పరిస్థితిలో కొందరు రైతులు డబ్బులు ఇస్తుండటంతో డబ్బులు ఇచ్చిన వారికే లారీలు పంపుతున్నా రు. తాము ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే పం పిస్తామని చెప్పడమే గాని లారీలు పంపడం లేదని పలు ధాన్యం కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. లారీలు రాక మండల ంలోని బుజిలాపురంలో 2,700 బస్తాలు, దత్తప్పగూడెంలో 1,300 బస్తాలు, పొడిచేడులో 1,032బస్తాలు, మోత్కూరులో 1,131బస్తాలు, అనాజిపు రంలో 300 బస్తాలు ఐదారు రోజులుగా ఎగుమతి కాకుండా కేంద్రాల్లో ఉన్నాయి. తూకం వేసిన బస్తాలు ఎగుమతి కాకపోవడంతో కాంటాలు నిలిపివేస్తున్నారు. బస్తాకు రూ.మూడు చొప్పున ఇస్తేనే వస్తామంటూ డ్రైవర్లు లారీలు తీసుకరావడం లేదని బుజిలాపురం రైతులు చింతల నారాయణరెడ్డి, మడిమన్కల రాజిరెడ్డి, చెడిపల్లి లింగయ్య, దత్తప్పగూడెం రైతులు కన్నెబోయిన సత్తయ్య, ఎలుగు నర్సింహ, నాయిని శంకరయ్య, ఎలుగు గంగుమల్లు తెలిపారు.

వర్షం వస్తే తూకం వేసిన బస్తాలు, రాశు లు తడుస్తాయని ఆవేదన చెందుతున్నారు. రవాణా చార్జీలు గిట్టుబాటు కాకుంటే ప్రభుత్వంతో మాట్లాడుకోవాలి కాని తమను అదనంగా డబ్బులు ఇవ్వమని వేధించడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తమకే నేరుగా రవాణా చార్జీలు చెల్లిస్తే తామే ట్రాక్టర్లు, డీసీఎంల ద్వారా ధాన్యం మిల్లులకు చేర్చుతామంటున్నారు. ఈ విషయాన్ని మోత్కూరు సింగిల్ విండో సీఈవో కె. వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా తూకం వేసిన బస్తాలు తీసుకెళ్లడానికి లారీలు రాకపోవడం వాస్తవమేనన్నారు. తాను ఎన్నోమార్లు ట్రాన్స్‌పోర్టు కంట్రాక్టర్, జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తున్నా లారీలు రావడం లేదని తెలిపారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మాజీమంత్రి జానారెడ్డికి జగదీష్‌రెడ్డి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, మే 1: తాను మంత్రిగా పదేళ్లలో చేసిన అభివృద్ధి, కుందూరు జానారెడ్డి మంత్రిగా పనిచేసిన 17ఏళ్లలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఇటీవల జానారెడ్డి సూర్యాపేటకు వచ్చిన సందర్భంగా సూర్యాపేటలో తనపై విమర్శలు చేశారని ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారని, ఆయన చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండి చర్చకు రావాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జానారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు సొంత నియోజకవర్గంలోనే ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జానారెడ్డి పెద్దరికం నిలుపుకోవాలని, అలాంటి వ్యక్తి కూడా అబద్ధాలు ఆడటం సమంజసం కాదన్నారు. తాను పదేళ్లుగా మంత్రిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషిచేశానన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానని ఒక మంత్రి అనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ప్రతిరోజూ అక్రమ కేసులు పెడుతూ పోలీస్ రాజ్యం నడిపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన ఒక్క నోటీసుకే వణికిపోతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి ఇచ్చిన నోటీసు కేంద్రంలోని బడేబాయి, రాష్ట్రంలోని చోటేబాయిల మధ్య జరుగుతున్న డ్రామా అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్టు చేయడం దారుణమని, పోలీసులు డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీ స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసుల రూపంలో ఎవరైనా కిడ్నాప్ చేశారనే విషయం తేలాలన్నారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, నాయకులు ఓంటెద్దు నర్సింహారెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, చీరా పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాడాలి : జూలకంటి



కళాకారులతో కలిసి కోలాటం ఆడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మే 1: మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపు నిచ్చారు. మే డే సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లగా మార్చి కార్మికుల హక్కుల్ని కేంద్రం కాలరాస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఏటా లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ ఆ లోటును పూడ్చేందుకు సామాన్యులపై పన్నుల భారం మోపుతోందన్నారు. ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగానికి తోడు ప్రైవేటీకరణతో పని భద్రత కరువవుతోందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో కోతలు పెట్టిందన్నారు. కమ్యూనిస్టులు కాకుండా ఇతర సంఘాలు, పార్టీలు సైతం మేడే ఉత్సవాలను నిర్వహిస్తున్నప్పటికి కార్మికుల పోరాట చరిత్రను ప్రజలకు చెప్పడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మూడావత్ రవినాయక్, సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, బావండ్ల పాండు, తిరుపతి రాంమూర్తి, రెమిడాల పరుశరాములు, గాదె పద్మ, వరలక్ష్మి, అం జద్ వినోద్ నాయక్, పిల్లుట్ల సైదులు, బాబునాయక్, వెంకట్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

యాదాద్రి, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయగిరిలో గల వినోద పారా బాయిల్డ్ రైస్‌మిల్లులో రాష్ట్ర సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఎంఆర్ రైస్ నిల్వలు ఎఫ్‌సీఐకి లక్ష్యం మేరకు అప్పగించారా? మిల్లులో ధాన్యం నిల్వలు ఎంత మేరకు ఉన్నాయని పరిశీలించారు. మిల్లుకు సంబంధించిన యాజమాన్యం ఎంతమేరకు ధాన్యం నిల్వచేసుకుంది, సీఎంఆర్‌కు సరిపడ ధాన్యం ఉన్నదా? లేదా అని గోదాముల్లోనూ తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లుకు సంబంధించిన లెక్కలను రాత్రి పొద్దుపోయే పరిశీలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దేవరకొండ, మే, 1: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని ఇద్దంపల్లిలో బుధవారం జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి. జైపాల్‌రెడ్డి(48) వ్యవసాయ పనులతో పాటు ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామానికి చెందిన ఎస్‌కే. బాల్బి అనే మహిళ ఇంట్లో ఫ్యాన్ మరమ్మతులకు గురైందని జైపాల్‌రెడ్డికి ఫోన్ చేయగా ఆయన బాల్బి ఇంటికి వెళ్లాడు. ఫ్యాన్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జైపాల్‌రెడ్డి తండ్రి పాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలి

● సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



వేములపల్లిలో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

వేములపల్లి, మే 1: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీ, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తరుపున నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు 2కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి కేవలం 30లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించి భారత యువతను మోసం చేసిందన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి వాటిని మరికొంతకు పెంచే యోచనలో ఉంటే బీజేపీ మాత్రం ముస్లింల రిజర్వేషన్ల రద్దుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్నికల హామీ మేరకు ఐదు న్యాయపత్రాల ద్వారా 25హామీలను నెరవేర్చడంతోపాటు ప్రతి మహిళా ఖాతాలో రూ.లక్ష జమా చేస్తుందన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాలుగా అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిమయంలో కూరుకుపోయిందన్నారు. కోట్ల రూపాయల అప్పుల్లో తెలంగాణను నిట్టనిలువునా ముంచిందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అనేక బహుళార్థక ప్రాజెక్టు అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులను కట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాలు గణనీయంగా ఉత్పత్తి సాధించి నిల్వలు చేసుకుంటే బీజేపీ అధికారం చేపట్టిన తరువాత వాటిని సివిల్ సప్లయ్ ద్వారా పంపిణి చేస్తూ తామే అభివృద్ధిలో ముందున్నామని చెప్పుకుంటుందన్నారు. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకుడు తీన్మార్ మల్లన్న, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీపీ పుట్టల సునీత, నాయకులు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, తమ్మడబోయిన అర్జున్, పుట్టల శ్రీను, రేగట్టె రవీందర్‌రెడ్డి, కందిమళ్ల లక్ష్మారెడ్డి, పిల్లల సందీప్, బీరవెల్లి సతీష్‌రెడ్డి, పుట్టల కృపయ్య, బొంగర్ల వినోద్, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పేరెల్లి నగేష్, నాగవెల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌కు న్యాయవాదులంతా మద్దతు తెలపాలని సీఎల్పీ మాజీ నేత కుందురూ జానారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అభ్యర్థి రఘువీర్‌తో బుధవారం నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఎంతో ఆలోచన కలిగిన వ్యక్తులు న్యాయవాదులని, అలాంటి వారు ఆలోచించి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. న్యాయవాదుల సమస్యలు తనకు తెలుసుకని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో రూ.15.90లక్షలు బదిలీ

సూర్యాపేట అర్బన్, మే 1: ఫోర్జరీ సంతకాలతో తమ కుమార్తె బ్యాంకు ఖాతా నుంచి తమ కుమారుడు రూ.15.90లక్షలు ఆయన ఖాతాకు బదిలీ చేసుకున్నాడని, ఆ డబ్బులను రికవరీ చేసి న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన వంగపెల్లి లక్ష్మీనారాయణ, పుష్పలత దంపతులు కోరారు. సూర్యాపేటలోని తమ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, అందరికీ పెళ్లి చేశామన్నారు. కుమారుడు అమెరికాలో నివసిస్తుండగా, చిన్న కుమార్తె తేజశ్రీ కెనడాలో నివసిస్తుందన్నారు. గత ఏడాది నవంబరు 23వ తేదీన తమ ఇంటికి కుమారుడు వంగపెల్లి సంతోష్, కోడలు స్వాతితో పాటు వియ్యంకుడు మేడిశెట్టి భద్రీనాథ్ వచ్చాడన్నారు. తమ పేరిట ఉన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కుమారుడు యత్నించగా తాము అంగీకరించలేదన్నారు. అనంతరం తమను ఏమార్చి బీరువాలో భద్రపర్చిన విలువైన వస్తువులు, ఆస్తి పత్రాలు, మిర్యాలగూడ కరూర్ వైశ్యా బ్యాంక్‌కు సంబంధించిన కుమారుడి జాయింట్ బ్యాంకు లాకర్ తాళాలు, కుమార్తె తేజశ్రీ ఖాతాకు చెందిన సూర్యాపేట ఐసీఐసీఐ బ్యాంకు చెక్కులను దొంగిలించారన్నారు. ఈ విషయాన్ని సూర్యాపేట పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తర్వాత కుమార్తె తేజశ్రీ ఖాతా నుంచి ఫోర్జరీ సంతకాలతో రెండు చెక్కుల ద్వారా కుమారుడు రూ.15.90లక్షలను తన ఖాతాకు మళ్లించుకున్నాడన్నారు. 10రోజుల క్రితం ఈ విషయమై సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కుమారుడి నుంచి నగదును రికవరీ చేయడంతో పాటు కుమారుడి నుంచి బ్యాంకు లాకర్ తాళాలు, ఆస్తి పత్రాలు, వస్తువులు, బ్యాంకు చెక్కులను ఇప్పించాలని, మహబూబాబాద్‌కు చెందిన వియ్యంకుడి నుంచి ప్రాణ భయం ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మఠంపల్లి, మే 1: రహదారిపై ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు తీవ్ర గాయపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మఠంపల్లి మండలం ఎర్రగట్టు వద్ద గత నెల 28వ తేదీ రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం గోవిందాపురానికి చెందిన దగ్గుబాటి రామనర్సు, కంకణాల రాములు మఠంపల్లిలో బంధువుల గృహ ప్రవేశానికి హజరై తిరిగి వెళుతుండగా ఎర్రగట్టు సమీపంలో రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. గాయపడిన వారిని 108లో హుజూర్‌నగర్, ఈ తర్వాత సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో రామనర్సు(35) మృతిచెందాడు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాదుకు తరలించారు. మూడు రోజులుగా హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్న కంకణాల రాము(26) బుధవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

తాటిచెట్లు, పైపులు, గడ్డివాము దగ్ధం



ఆత్మకూర్ (ఎస్), మే 1: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని గట్టికల్ గ్రామ శివారులో గుండువారి బావి సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలను కాల్చడానికి నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. మంటల తీవ్రతరం పెరిగి తాటి చెట్లు, వ్యవసాయ బావుల వద్ద ఉన్న పైపులు, వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద తీవ్రతరం కావడంతో కొంతమంది స్థానికులు సూర్యాపేట ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ప్రమాద స్థలానికి చేరుకున్న ఫైర్ వాహనంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. సుమారు 20ఎకరాలకుపైగా వరి కొయ్య కాళ్లు, గడ్డి కాలిపోయాయి.

రెపరెపలాడిన ఎర్ర జెండా

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా బుధవారం జిల్లాలో వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఎనిమిది గంటల పని విధానం కోసం చికాగో నగరంలో పోరాడిన కార్మికులపై ఆనాటి పాలకుల మారణకాండను మరోసారి గుర్తు చేసుకున్నారు. అమరుల స్ఫూర్తితో కార్మిక రక్షణ చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలని కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. ●ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


హుజూర్‌నగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


కోదాడలో మేడే వేడుకల్లో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నాయకుడు పారా సీతయ్య, తదితరులు


సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకుడు శివకుమార్


గరిడేపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్



సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న ఐద్వా నాయకురాలు మల్లు లక్ష్మి

హుజూర్‌నగర్‌లో ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్




మఠంపల్లిలో..


మద్దిరాలలో..


అర్వపల్లిలో..


సూర్యాపేటలో మేడే వేడుకల్లో పాల్గొన్న ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి


సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి


తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో జెండా ఎగరవేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి జి.ఉప్పలయ్య, తదితరులు


తిరుమలగిరిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

నేటి నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ ప్రచారం

హుజూర్‌నగర్, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి గురువారం నుంచి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 10గంటల వరకు మోతె, 10గంటల నుంచి 12.30వరకు నడిగూడెం. సాయంత్రం నాలుగు గంటల నుంచి 5.30వరకు మునగాల, ఆరు గంటల నుంచి 8.30వరకు కోదాడ టౌన్, రూరల్, అనంతగిరి మండలాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. 3వ తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి 10గంటల వరకు చిలుకూరు మండలం, 10.30గంటల నుంచి 12.30వరకు చింతలపాలెం మండలం, నాలుగు గంటల నుంచి 5.30వరకు మేళ్లచెరువు మండలం, ఆరు గంటల నుంచి 8.30వరకు హుజూర్‌నగర్ టౌన్, రూరల్‌లో ప్రచారం, సమావేశం, పట్టణంలో పాదయాత్ర, నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి 10గంటల వరకు మట్టపల్లి మండలం, 10.30గంటల నుంచి 12.30 వరకు గరిడేపల్లి మండలం, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటలత వరకు పాలకవీడు మండలం, సాయంత్రం 6.30నుంచి 8.30వరకు నేరేడుచర్ల టౌన్, మండలంలో ప్రచారం చేస్తామన్నారు. ప్రచారంలో భాగంగా నిర్వహించే రోడ్‌షోలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి పాల్గొంటారని, పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనృసంహుని నిత్య కల్యాణం

మఠంపల్లి, మే 1: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చె న్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూ ర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ రూరల్, మే 1: పట్టణంలో బుధవారం పలు ఇళ్లల్లో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలకు పూలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు, సుజాత, ఆండాలు, పద్మావతి, లక్ష్మి, సంధ్య, రాధ, భవాని, అన్నపూర్ణ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరం

హుజూర్‌నగర్, మే 1: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ కట్టా పెద్దగోపాల్‌రావుచౌదరి, కట్టా చిన్నగోపాల్‌రావు కోరారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురంలో చలివేంద్రాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కట్టా గోపి, భాస్కర్‌రావు, పారుపల్లి శ్రీనివాసరావు, వెంగళ్‌రెడ్డి నారాయణరెడ్డి, పారుపల్లి శేఖర్, జింకల వీరాంజనేయులు, కట్టా శ్రీనివాస్‌రావు, యలమంచిలి శ్రీనివాసరావు, మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో చలివేంద్రం

మఠంపల్లి, మే 1: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో 2002-03పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సహకారంతో చలివేంగ్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పూర్వ విద్యార్థి దేవపంగు మంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీరు అందించాలనే సంకల్పంతో, తోటి విద్యార్థుల సహకారంతో చలివేంద్రం ఏర్పాటుచేశామ న్నారు. ఎండల తీవ్రత తగ్గేవరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు.

మజ్జిగ పంపిణీ

ఆత్మకూర్(ఎస్), మే 1: వేసవి సందర్భంగా మండల కేంద్రంలో మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడి నరసమ్మ జ్ఞాపకార్థం బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడి ఫౌండేషన్ చైర్మన్ మేడి కృష్ణ, మేడి లింగయ్య, మేడి శ్రీను, జలగం సైదులు, శివశంకర్, పూర్ణ, రమేష్, అనూష, తదితరులు పాల్గొన్నారు.

లూటీ చేసిన నేతలను జైలుకు పంపుతాం


తుంగుర్తిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, సామేలు, హాజరైన ప్రజలు

తుంగతుర్తి, మే 1: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసిన నేతలను జైలుకు పంపిస్తామని మునుగోడు, తుంగతుర్తి ఎమ్మెల్యే లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో మాట్లాడారు. యాదాద్రి పవర్ ప్లాంట్, కలెక్టరేట్ నిర్మాణంలో వేల కోట్లను జగదీష్‌రెడ్డి అక్రమంగా సంపాదించారని, భూదందా, ఇసుక దందాలోనూ కోట్లాది రూపాయలను అక్రమంగా ఆర్జించారని ఆరోపించారు. కిరాయి ఇంట్లో ఉన్న జగదీష్‌రెడ్డికి ఇన్ని కోట్లు ఎక్కడినుంచి వచ్చాయనిప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. లిక్కర్ కుంభకోణంలో తీహార్ జైల్లో ఉన్న కవిత, వచ్చే బతుకమ్మ కూడా జైలులోనే ఆడుతుందని జోస్యం చెప్పారు. భువనగిరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ముందుగా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వాహనంపై ఉన్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, నాయకులు గుడిపాటి నరసయ్య, బాలలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, ఉప్పుల రాంబాబు, పెదబోయిన అజయ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

సూర్యాపేట సిటీ, కోదాడ మే 1: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నల్లగొండ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పేదల కోసం బీజేపీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వందేళ్లుగా పరిష్కారం కాని కశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు, రామ మందిరం నిర్మాణాన్ని చేపట్టిందన్నారు.. రేవంత్‌రెడ్డి అమలుకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. నల్గొండ ఎంపీగా పనిచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్గొండ అభివృద్ధికి ఏమీచేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. స్థానిక యువతకు ఏడాదికి 50 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, కూలికి వెళ్లే మహిళలకు స్వయం ఉపాధి పథకాలు అమలుచేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంటు కోకన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి పాల్గొన్నారు.


సూర్యాపేటలో మాట్లాడుతున్న నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ పార్లమెంట్ ప్రభారీ చాడ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీజేపీ మండల కోఆర్డినేటర్ల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో రాష్ట్రానికి ఒరిగేది ఏమీలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు.కార్యక్రమంలో భాగ్యరెడ్డి, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, నరేష్‌గౌడ్, శ్రీలతరెడ్డి, అంజియాదవ్, కవితారెడ్డి, వంగవీటి శ్రీనివాసరావు, కిట్టు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేట అర్బన్, మే 1: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన మల్లు ఉపేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘాలతో చర్చించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, యాకయ్య, వెంకటయ్య, మల్లు వెంకటరాంరెడ్డి, సోమయ్య, ఏకలక్ష్మి, వీరారెడ్డి, పాపిరెడ్డి, కర్నాకర్‌రెడ్డి, రమేష్, జనార్దన్, ధారాసింగ్, లాలు, శ్రీనివాసాచారి, లింగయ్య, జ్యోతి, యాదగిరి, శ్రీను, సత్యనారాయణ, కర్నాకర్‌రెడ్డి, సైదా, శేఖర్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉండాలి

హుజూర్‌నగర్ రూరల్, మే 1: కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిజం అంటేనే నిజమని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. . 12గంటల నిర్బంధ పని విధానాన్ని రద్దు కావాలని చికాగో నగరంలో కార్మికులు వీరోచిత పోరాటం చేశారన్నారు. ఆ పోరాటం ఫలితంగా ఎనిమిది గంటల పనివిధానం సాధించుకున్నామన్నారు. ముందుగా పట్టణంలోని ఇందిర సెంటరు నుంచి పొట్టి శ్రీరాములు సెంటరు వరకు భారీ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, శీలం శ్రీను, పోసనబోయిన హుస్సేన్, ఎలక సోమయ్య, దుగ్గి బ్రహ్మం, త్రివేణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడాలి

సూర్యాపేట టౌన్, మే 1: బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతబాబుమాదిగ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, జానయ్య, పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యానికి బీజేపీ ప్రమాదకరం: టీజేఎస్

సూర్యాపేటఅర్బన్, ఆత్మకూర్(ఎస్): దేశంలో లౌకిక ప్రజాస్వామ్యానికి బీజేపీ ప్రమాదకరమని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎ కార్యక్రమంలో కిరణ్, కృష్ణారెడ్డి, గోపి, పాల్గొన్నారు.

● ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని టీజేఎస్ మండల కోఆర్డినేటర్ జాటోతు శ్రీనివాస్, మండల కన్వీనర్ తండు రాములు అన్నారు. కాంగ్రెస్‌కు మద్దతుగా సూర్యాపేట మండంలోని పాత సూర్యాపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు.

హుజూర్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు..

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



చివ్వెంల మండలం పాచ్యాతండాలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

చివ్వెంల, హుజూర్ నగర్, పెన్‌పహాడ్ గరిడేపల్లి, మే 1: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం చివ్వెంల మండలం లోని పాచ్యానాయక్‌తండాలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రచారంలో ఎంపీపీ కుమారిబాబు నాయక్, జడ్పీటీసీ సంజీవనాయక్, జూలకంటి జీవన్‌రెడ్డి, నాయకులు రౌతు నర్సింహారావు, ఉట్కూరి సైదులు, సత్యం, గోవిందరెడ్డి, బాలాజీ నాయక్, అనిల్‌నాయక్, పాల్గొన్నారు.

● కరువును ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురంలో బీఆర్ఎస్ నాయకులు కట్టా వెంకటేశ్వరరావు, తుళ్ళూరి సైదులు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాలను బుధవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే కరువు, కాటకాలకు నిలయమన్నారు. కార్యక్రమంలో ఒంటెద్దు నర్సింహారెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, పచ్చిపాల ఉపేందర్, ముల్కలపల్లి రాంబాబు, పత్తిపాటి నాగరాజు, రమ్య, దొడ్డా నర్సింహారావు, జక్కుల నాగేశ్వరరావు, అమర్‌గౌడ్ పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ మండలం నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు ఐతబోయిన లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం జరిగిన లింగయ్య పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి సంతాపం తెలిపారు.

● గరిడేపల్లిలో ఎంపీటీసీ సభ్యురాలు కడియం స్వప్న తండ్రి తాటి నర్సిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు.

'రేపటి బీఆర్ఎస్ ర్యాలీని విజయవంతం చేయాలి'

తుంగతుర్తి, మే 1: భువనగిరి పార్లమెంట్ నియోజకర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ తుంగతుర్తి మండల కేంద్రంలో ఈ నెల మూడో తేదీన నిర్వహించే ర్యాలీని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్ని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ కోరారు. అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నిక సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమాగమైందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో గుజ్జ యుగంధర్‌రావు, మట్టిపల్లి శ్రీశైలం యాదవ్, రాములుగౌడ్, తాటికొండ సీతయ్య, దొంగరి శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు'

సూర్యాపేట(కలెక్టరేట్), మే1: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, గండూరి ప్రకాష్ అన్నారు. నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని 36వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బూరబాలసైదులుగౌడ్, సుంకరి రమేష్, చింతలపాటి భరత్‌మహాజన్, మడిపల్లి విక్రమ్, కొండపల్లి సాగర్‌రెడ్డి, బండారురాజా, సలీం, నల్లపాటి అప్పారావు, ఉపేందర్‌రావ ,పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో మాజీ సర్పంచ్ చేరిక

తిరుమలగిరి, మే 1: మండలంలోని మామిడాల మాజీ సర్పంచ్ జెడిద కరుణాకర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బుధవారం మునిసిపాలిటీ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, దూపటి రవీందర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మాధవరెడ్డి మృతి

అనంతగిరి, మే 1: మండలంలోని చనుపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ముస్కు మాధవరెడ్డి (80)అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను మంగళవారం రాత్రి చనుపల్లి గ్రామంలో నిర్వహించారు మాధవరెడ్డి మృతికి ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కునుకుంట్ల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

మేళ్లచెర్వు, మే 1: ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీవిద్యార్థులను వైఆర్‌పీ ఫౌండేషన్ సభ్యులు అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన బొడ్డు నవీన్‌సాయి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 467/470 మార్కులు సాధించగా, బుధవారం హైదరాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొడ్డు పురుషోత్తం, రవిప్రకాష్, దయాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.